## కాంగ్రెస్‌లో చేరిక


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్

**రాజేంద్రనగర్:** రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ మాజీ కోశాధికారి రాపోలు సత్తయ్య కాంగ్రెస్ గూటికి చేరారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



## మోర్ట్ శ్రీనివాస్‌కు దాసరి అవార్డు

**శంషాబాద్:** పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, మోర్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్ దాసరి ఫిల్మ్ అవార్డును అందుకున్నారు. నిర్మాత, దర్శకుడు తుమ్మలపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సేవా విభాగంలో అవార్డును అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సినీ ప్రముఖులు పాల్గొన్నారు. సినీరగంలో దిగ్గజమైన దాసరి పేరుమీద అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.







# బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి


కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**బండ్లగూడ:** బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బైరాగిగూడకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ సిద్ధాంతాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని సూచించారు.

**చేవెళ్లలో కాసాని గెలుపు ఖాయం**

**మణికొండ:** చేవెళ్ల ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు ధీమా వ్యక్తం చేశారు. మణికొండ మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని ప్రజలు తెలుసుకున్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి.కావ్య శ్రీరాములు, మైనార్టీ అధ్యక్షుడు బషీర్, నాయకులు లక్ష్మీశ్రీ, గుట్టమీది నరేందర్, విశల్, మల్లేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు



**అత్తాపూర్ :** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అత్తాపూర్‌లోని రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో శనివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నెల 3 నుంచి 8 వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగులకు అవకాశం కల్పించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో టెంట్లు తాగునీటి సదుపాయం కల్పించారు. రాజేంద్రనగర్ ఆర్డీవో కొప్పుల వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో రెండో రోజు ప్రశాంతంగా ముగిసింది.

## కేవీఆర్‌తోనే చేవెళ్ల ప్రగతి


గేటెడ్ కమ్యూనిటీ వారితో మాట్లాడుతున్న సంగీతారెడ్డి

**మణికొండ:** చేవెళ్ల అభివృద్ధి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఆయన సతీమణి సంగీతారెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీలోని రాజపుష్ప, ఫ్రంట్ లైన్, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్‌సీ గేటెడ్ కమ్యూనిటీలో విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో విశ్వేశ్వర్‌రెడ్డి 2 లక్షల భారీ మెజారీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. అన్ని మున్సిపాలిటీలు, మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాలపై సమగ్ర పట్టు ఉన్న ఆయన గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో అర్హులందరూ పాల్గొని బీజేపీకి ఓటు వేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆయా గేటెడ్ కమ్యూనిటీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నాయకులతో భేటీ


జ్ఞానేశ్వర్‌ను కలిసిన మహేశ్

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ డివిజన్ ఎన్నికల కో–ఆర్డినేటర్ పలుగుచెరువు మహేశ్ పలువురు నాయకులను శనివారం కలిశారు. తెలంగాణ రాష్ట్ర పాడి పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు ప్రేమ్ గౌడ్, సంగా రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, వ్యూహకర్త సమన్వయకర్త గంగని అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు జాన్‌పాల్, పలుగుచెరువు మహేందర్, ఆరింట్ల విశాల్, మేకం సుభాష్, ఆదిరాల అరుణ్ బాబు, ఇటికాల రాజు, వడ్లకొండ సురేశ్, దర్గా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**శంషాబాద్:** పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాళ్లగూడ బస్తీకి చెందిన రంగారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (37) ఈ నెల 2 వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం ఫోర్ట్‌గ్రాండ్ సమీపంలో గ్రాండ్ విల్లా ప్రాంతంలో మృతిచెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు.

**ఇంద్రారెడ్డి కాలనీ సమీపంలో..**

పట్టణంలోని ఇంద్రారెడ్డి కాలనీ సమీపంలో మరొకరు మృతి చెందాడు. శనివారం మధ్యాహ్నం స్థానికుల సమాచారం మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతుడి సమీపంలో ఉన్న ప్లాస్టిక్ కవర్లో దొరికిన ఆధార్ కార్డులో మొకరాల రవికుమార్ హయత్‌నగర్, శాంతినగర్ చిరుమానాతో ఉంది. ఆకలి లేదా వడదెబ్బ కారణంగా మృతి చెందాడా..? మరే ఇతర కారణాలు ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

## చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి


కార్యకర్తలకు అభివాదం చేస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి:** చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేసేందుకు ఓటర్లు కరుణించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి కోరారు. మధుబన్ కాలనీ నుంచి కాటేదాన్ చౌరస్తా వరకు బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఎన్నికల కో ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అబ్బేశి సదాలక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు ఎస్ ధనంజయ్ ఆధ్వర్యంలో 5 వేల మంది కార్యకర్తలతో కలిసి శనివారం భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలు నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన కాంగ్రెస్ గెలువడం ఖాయమని సామ ఇంద్రపాల్‌రెడ్డి అన్నారు.


అత్తాపూర్ డివిజన్ పరిధిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్సే..**

**అత్తాపూర్ :** కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. అత్తాపూర్ భూపాల్‌నగర్ వీకర్ సెక్షన్, బస్తీల్లో ఎంపీ రంజిత్ రెడ్డికి మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, రవీందర్, సుధాకర్ రెడ్డి, మహేందర్, హరి, నాగరాజు, రమేశ్, సురేశ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవి, పీఎం రెడ్డి, సంతోష్‌గుప్తా, మధు, భాస్కర్, సతీశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే దృఢత్వం



మిల్లెట్స్ మార్వెల్స్ ప్రారంభంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

**బండ్లగూడ:** అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నప్పుడే ధృడంగా ఉంటారని మిల్లెట్ మార్వెల్స్ మెంటర్, గైడ్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ డాన్‌బాస్కోనగర్‌లో మిల్లెట్ మార్వెల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ఎక్స్‌పీరియన్స్ హబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో భారత్‌లో మొదటి హబ్‌ను ఏర్పాటు చేశారన్నారు. గ్లోబల్ సెంటర్లు ఐఐఎంఆర్, న్యూట్రీహబ్‌తో కలిసి అభివృద్ధి చేసిన మొదటి మిల్లెట్ చాట్‌ను ఈ హబ్ అందిస్తుందన్నారు. వరుసగా మూడేళ్లుగా భారత ప్రభుత్వం నుంచి పోషక అనాజ్ అవార్డు కూడా అందుకుందని తెలిపారు. చేవెళ్లలాంటి వర్షభావ ప్రాంతాల వారు మిల్లెట్స్ సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. యువ పారిశ్రామికవేత్తలు మిల్లెట్స్ సాగు ఎగుమతులపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో మిల్లెట్ మార్వెల్స్ ఫౌండర్ డాక్టర్ భరత్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శోభక్క, అంజన్‌కుమార్‌గౌడ్, మల్లారెడ్డి, మహేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో


శంషాబాద్ పట్టణంలో స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

**శంషాబాద్:** చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 5న (నేడు) సాయంత్రం శంషాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పి. సంజయ్ యాదవ్ స్థలాన్ని పరిశీలించారు.

**నేడు శంషాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు**

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు షో నేపథ్యంలో శంషాబాద్ పట్టణంలో ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షల ఉంటాయని ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు, మహబూబ్‌నగర్, బెంగళూరు వెళ్లాల్సిన వాహనదారులు శంషాబాద్‌లోని ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలి. ఎయిర్‌పోర్టు, మహబూబ్‌నగర్ నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు కూడా సర్వీసు రోడ్డు కాకుండా శంషాబాద్ ఫ్లైఓవర్‌ను మాత్రమే వినియోగించాలన్నారు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్, షాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికులు ఓఆర్‌ఆర్ మీదుగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు.